142

# రాయల్ బెగ్గర్స్

"అమ్మగారూ! ఒక్క పైసా ధర్మం చెయ్యండి తల్లీ! బాబూగారూ! ఒక్క పైసా!"

కారు మీద తడుముకుంటూ, డోర్ దగ్గర నిల్చుని అతి దీనంగా అడుగుతున్నాడో గుడ్డి బిచ్చగాడు. అతగాడిని చూస్తుంటే నా హృదయం జాలితో నిండిపోతోంది. కళ్ళు రెండూ లేవూ! కళ్ళ గుంటల చుట్టూరా నల్లగావుంది! ఒకే కాలు వుంది. ఇన్ని కార్లూ, సిటీ బస్సులూ తప్పుకు ఎలా మా కారుదగ్గరకు చేరగలిగాడో పాపం! హాండ్ బాగ్ జిప్ లాగాను. రూపాయి నోటు చేతికి తగిలింది. హఠాత్తుగా శ్రీవారు చటుక్కున నా చెయ్యి పట్టుకున్నారు.

"ఏయ్! ధర్మంలేదు గిర్మంలేదు, వెళ్ళవతలికి." గర్జించారు బిచ్చగాడి వేపు చూస్తూ.

"బాబూ!" దీనంగా పిలిచాడు.

"ముందు కారు కడ్డు లేస్తావా? పోలీసుల్ని పిలవనా?"

ఏదో గొణుక్కుంటూ, కుంటుతూ వెను దిరిగాడు అతగాడు.

కారు కదిలింది. "ఏమిటి మీ అఘాయిత్యం?" కోపంతో చెయ్యి విదిలించుకున్నాను.

శ్రీవారు రోడ్డుమీదికి దృష్టిసారిస్తూ తేలికగా నవ్వేశారు. నాకు ఒళ్ళు మండి పోతోంది శ్రీవారి ప్రవర్తనకు.

"ఏం! ఒక్క రూపాయి ఆ బిచ్చగాడికిస్తే మన సిరి తరిగిపోతుందా?"

శ్రీవారు మృదువుగా నా భుజం చుట్టూరా చెయ్యి వేశారు. "డియర్ రాధా! వాడు నిజంగా గుడ్డివాడే అయితే, రూపాయి కాదు, ఐదురూపాయలు ఇచ్చినా నాకు బాధ లేదు.... కానీ వాడు...."

ఆశ్చర్యంగా శ్రీవారి వేపు చూశాను....

"నా మాటల్లో నమ్మకంలేదు కదూ?" కారు రివర్స్ చేసి కాస్త దూరం పోనిచ్చి ఆపారు. "అలా చూడు!"

శ్రీవారు చూపిన వేపు చూశాను. శరవేగంతో వెళ్తున్న కార్లూ, స్కూటర్లూ, సిటీ బస్సులను అవలీలగా తప్పించుకుంటూ ఒంటికాలుతో ఛెంగు ఛెంగున వెడ్తున్నాడా బిచ్చగాడు.

"బాగా గమనించిచూడు రాధా! ఆ కళ్ళచుట్టూరా ఏదో నల్లటి పదార్థం రాచుకున్నాడు. చీకటిపడ్డాక కడిగేసుకుంటే పోతుందది.... కాలు వేపు చూడు! కాలు వెనక్కు మడిచికట్టి, మోకాలి దగ్గర విరిగిన కాలు ఆకారం వచ్చేలా ప్లాస్టిక్ పరికరమేదో అమర్చుకున్నాడు...."

నా కళ్ళు గిర్రున తిరిగినట్లైంది క్షణకాలం. పొట్ట కూటి కోసం, ఇలా మోసం చేస్తున్న అతగాడిమీద జాలి స్థానంలో ఇట్టే కోపం వచ్చేసింది.

"హలో మురళీ! అరె; రాధాగారు కూడా వున్నారా! వెల్!"

హడావుడిగా డాక్టర్ మూర్తి రావటంతో నా ఆలోచనలకు సడెన్ బ్రేక్ పడిపోయింది.

"ఈరోజు సాయంత్రం మా పాప బర్త్‌డే పార్టీ వుందోయ్! ఆటే హంగామా చెయ్యటం లేదులే! ఆహూతులకు సింపుల్‌గా తలకో కూల్‌డ్రింక్ మాత్రం ఇచ్చేస్తాం! పొదుపు పథకం మా దంపతులం తు.చ. తప్పకుండా అమలు జరుపుతామని మీకు తెలుసుగా? ఆహూతులు కూడా అట్టే ఎక్కువమంది వుండరు! మీ బోటి ముఖ్యమైన కొందరికే ఆహ్వానాలు....తప్పక వస్తారుకదూ?"

"ఆ....!"

డాక్టర్ మూర్తి వెళ్ళిపోయారు.

"రాధా! సాయంత్రం మళ్ళీ షాపింగ్ ప్రోగ్రాం లేకుండా, వాళ్ళ పాపకు పట్టుకెళ్ళాల్సిన బహుమతులు ఇప్పుడే కొందామా?"

"ఆ! టాయ్ ఎంపోరియంకు వెడదాం పదండి. రెడీమేడ్ గౌను కూడా ఒకటి కొనాలి!"

ఏభై రూపాయల బిల్లుతో, బొమ్మల పేకెట్లు, గౌను తీసుకు వచ్చేశాం.

* * *

సాయంత్రం.

నాలుగున్నర కల్లా నా ముస్తాబు పూర్తయింది. శ్రీవారు ఇంకా బాత్‌రూంలోంచి బయటికి రాందే?

శాండల్ వుడ్ ఆయిల్ పరిమళం బాత్ రూంలోంచి పొంగి పొర్లు తోంది. కాలింగ్ బజర్ ఆగకుండా శబ్దం చేస్తోంది. గుమ్ము రూంలోకి వచ్చాను.

"మురళీధర్ గారున్నారండీ"?

ఎవరో ఇద్దరు నడివయస్కులైన స్త్రీలు, ఇద్దరు పురుషులు.

"రండి, ఇలా కూర్చోండి. బాత్ రూంలో వున్నారు. వస్తారు?" పరస్పరం నమస్కారాలయ్యాయి. పరిచయాలు మొదలెట్టారు.

"కొత్తగా మహిళాసంస్థనొకదాన్ని స్థాపించాలని సంక ల్పించాం ...." శ్రీమతి విజయ మొదలెట్టింది.

"దానికి అనుబంధంగా అనాథ బాలబాలికల శరణా లయానొకదాన్ని కూడా పెట్టాలని అనుకుంటున్నాం!" వినా యకరావుగారు పూర్తి చేశారు.

"ఇంకా చాలామంది మెంబర్లు వున్నారులెండి. ఇలా విరాళాలు పోగుచేసి, మానవసేవ చేద్దామని మావుద్దేశ్యం!" రెండో ఆవిడ....లలితారావు తమ బృహత్కార్యక్రమం యొక్క ముఖ్యోద్దేశ్యం వివరిస్తోంది.....

శ్రీవారు రూంలోకి అడుగుపెట్టినందుకు గుర్తుగా మైల్డ్ పెర్ ఫ్యూమ్ గదంతా వ్యాపించింది.

"మీరు మా సంస్థకు కనీసం ఐదువేల రూపాయలేనా విరాళంగా ఇవ్వాలి!"

నా గుండె క్షణకాలం ఆగినట్లైంది. శ్రీవారు మాత్రం నిబ్బరంగా సోఫాలో కూర్చున్నారు.

ఐదువేలు !

పెళ్ళి కెదిగివచ్చిన ఇద్దరాడబడుచులకు పెళ్ళిళ్లు చేయాలి! మెడిసిన్ చదువుతున్న మరిదికి నెలనెలా డబ్బు పంపాలి! ఏడేళ్లుగా ఏటా పురుడు బోసుకుంటున్న ఆడపడుచుకు ఈ మారేనా ఆపరేషన్ చేయించాలి ! ఇవిగాక మా స్వంత ఖర్చులు !

"అలా తటపటాయిస్తున్నా రేమిటండీ ! ఆఫ్టరాల్ మే మడిగిందెంత? ఐదువేలేగా? మీరే వెనకాడితే, ఇక మిగతావారు ఏమిస్తారు? ఇదేం మాకోసం కాదుగా? మనలాటి వేలాది మనుష్యుల కోసమేగా?" అతి చనువుగా నవ్వుతూ అంది శ్రీమతి విజయ.

శ్రీవారు తాపీగా నవ్వారు. "మీలాంటి బాచెస్ రెండు మూడు వచ్చి ఇలాటి సంస్థల పేర్లే చెప్పి, ఈసరికే రెండువేల రూపాయలవరకూ పట్టుకెళ్లారు విరాళాలు! కానీ ఇంతవరకు ఆ సంస్థలు మొలిచిన ఆనవాలులేందే! సంస్థలు స్థాపించాక రండి. నాకు తోచిందేదో ఇస్తాను ! రాధా ! రడీగావున్నవా? మనం మూర్తిగారింటికి వెళ్లాలిగదా !"

అవతలి వాళ్ళకు ఇక అవకాశం ఇవ్వకుండా శ్రీవారు వరండాలోకి వెళ్ళిపోయారు....వచ్చినవారు మెల్లిగా బయటికి నడిచారు నిర్జీవంగా !

* * *

డాక్టర్ మూర్తి ఇంట్లో అడుగెట్టి నిర్ఘాంతపోయాను. ఏం హడావుడిగా వుండదనుకున్నాను. కానీ, ఆహూతులు దాదాపు నూటయాభై మందికి పైగానే వున్నారు. అందరి చేతుల్లోనూ బహుమతుల తాలూకు పేకెట్సు వున్నాయి.

"ఏమిటో ఈ ఆడంబరాలంతా మాకు నచ్చవురాధా! ఈ బహుమతులు తేవటం ఎందుకూ?" మందలిస్తూనే బహుమతి పాకెట్ అందుకుంది మిసెస్ మూర్తి.

"రాధక్క—య్యా! నువ్వొవచ్చావా ? హలో మురళి బావా ! కులాసా?" దూరపు బంధువు గోపాల్ నవ్వుతూ దగ్గరగా వచ్చాడు.

"ఆ ! డాక్టర్ మూర్తి నీకు తెలుసా?" శ్రీవారు ఆశ్చర్యంగా అడిగారు.

"ఆ....వ్యాపారం పెడుతున్నానుగా ! ఇలాంటివారితో పరిచయాలు పెంచుకోవాలిగదా !"

"ఏం వ్యాపారం?" కుతూహలంగా అడిగాను....

"ఫాన్సీ.... కమ్ రెడీమేడ్ క్లాత్ ఎంపోరియం.... టాయిస్....క్లాత్స్, ఒకటేమిటిలే అన్నీనూ .... అన్నట్లు ఎల్లుండే నా షాప్ ఓపెన్ చేస్తాను....మీరిద్దరూ తప్పకుండా రావాలి.... మొదటి బోణీ మీదే కావాలి...."

"భలేవాడివే!" శ్రీవారు నవ్వేశారు.

అన్నమాటప్రకారం సింపుల్‌గా తలకో కూల్‌డ్రింక్ ఇచ్చారు మూర్తి దంపతులు పాపను. ఆశీర్వదించి వచ్చేశాం....

* * *

ST. JOSEPH'S GIRLS HIGH SCHOOL GUNTUR

మూడు రోజుల్లో బెజవాడ వెళ్ళాలి. పెద్దాడపడుచు పిల్లలకు బట్టలూ, బొమ్మలూ కొనుక్కు వెళ్ళాలి.

"అన్నట్లు రాధా ! ఈరోజే కదూ గోపాల్ షాపు ఓపెన్ చేస్తానన్నాడూ ? మనక్కావలసిన వస్తువులేవో అక్కడే కొందాం ! వాడికి బోణీ చేసినట్లూ వుంటుంది, వాడి బిజినెస్ చూచినట్లూ వుంటుంది !" అన్నాడు శ్రీవారు.

సాయంత్రం బయల్దేరాం. గోపాల్ మహా ఆనంది పడిపోయాడు. పొందికగా అమర్చిన వస్తువులూ, బొమ్మలూ, కన్నులపండువుగా వున్నాయి..... హఠాత్తుగా నా కళ్ళు షోకేస్‌లో వ్రేలాడుతున్న గౌనుమీద పడింది .... మొన్న సాయంత్రం మేము, మూర్తి పాపకు బర్త్‌డే కానుకగా ఇచ్చిన గౌను....అదే డిజైన్....అదే సైజు.

"అక్కయ్యా ! ఆ గౌను కొంటావా ? మీ దగ్గర లాభం దీసుకోనులే, అసలు ఖరీనుకే ఇస్తాను .... పది రూపాయలు........"

శ్రీవారివేపు చూచాను. "అలాంటి గౌనే మేం పదిహేను రూపాయలకు కొన్నామోయ్ గోపాలం....ఇక నీ బిజినెస్ గట్టెక్కినట్లే!" వేళాకోళంగా అన్నారు శ్రీవారు.

గోపాలం నవ్వాడు. "నీకు తెలీదు మురళిబావా నా తడాఖా ! మామూలు షాప్స్‌లో అయితే మీ కలాంటి గౌను పదిహేను రూపాయలకు తక్కువరాదు. నాకయినా అంతే.... కానీ.... నాబిజినెస్ కిటుకు ఇక్కడే వుంది...."

"ఏమిటి ?" కుతూహలంగా అడిగాను.

"ఈమధ్య బర్త్ డే పార్టీస్ ఎక్కువగా బహుమతుల కోసమే జరుగుతున్నాయి... వివాహసందర్భాలలో కూడా బహుమతులు ఎక్కువగానే వస్తుంటాయిగా! నేనో రహస్యం కనిపెట్టాను. అలాంటి వేడుకలు జరుగుతాయని తెలిసినప్పుడు, ఆ వేడుకలు జరిపేవారితో లోపాయికారిగా ఓ ఒప్పందం చేసుకుంటాను....అదేమిటో తెలుసా!" గోపాల్ గుక్క తిప్పుకోవటానికి ఆగాడు.

"ఏమిటి?" సస్పెన్స్ భరించలేక నేనే అడిగేశాను.

"ఆహూతుల సంఖ్యనుబట్టి, బహుమతుల విలువ ఉజ్జాయింపుగా అంచనా వేసుకుంటాం! వెంటనే కాంట్రాక్టులా నేనో రెండు వందల రూపాయలు ఆ వేడుకజరిపే ఆసామికి అడ్వాన్సుగా ఇస్తాను. ఆ తర్వాత వచ్చే బహుమతులన్నీ నాకే ఇవ్వాలి....అవి బట్టలు కావచ్చు....బొమ్మలు కావచ్చు.... మరేదేనా కావచ్చు....అతి ముఖ్యమయినవి మాత్రం వారు వుంచుకొని మిగతావి నా కిచ్చేస్తారు...."

నాకు నోటమాట వెలువడలేదు. గోపాలం చెప్పుకు పోతున్నాడు.

"షుమారు మూడు సంవత్సరాలుగా ఇదే బిజినెస్ చేస్తున్నాను. కానీ నేను చెల్లించిన డబ్బుకు మూడింతలుగా వస్తువులు నాకు ముడుతున్నాయి...."

"మరి ఆ వేడుకలు జరిపే ఆసామికి నష్టంకాదూ?" అన్నాను వుండబట్టలేక.

"ఎంత అమాయకురాలివమ్మా అక్కయ్యా! ఆ ఆసామికి వచ్చినమటుకే జమ.... మొన్న మూర్తిగారు చూడి ! ఆహూతులకు సింపుల్‌గా కూల్‌డ్రింక్స్ ఇచ్చేశారు ! శారి దగ్గర రెండువందల రూపాయలకు ఆసరికే కాంట్రాక్టు ప్రకారం బహుమతులు నేను పుచ్చుకునేలా వాగ్దానం తీసుకున్నాను........అదుగో అ బొమ్మలన్నీ - ఆ వస్తువులన్నీ వాళ్ళింట్లూ తీసుకున్నవే!" గాజు బీరువావేపు చూపించాడు గోపాల్.

ఒ మూలగా మేం బహుమతిగా ఇచ్చిన టాయిస్ కూడా వున్నాయి!

"ఆయనగారికి స్వంతానికి కొన్ని బహుమతులు తీసి పెట్టుకుని, మిగతావినా కిచ్చేశారు? రెండువందల రూపాయల డబ్బు, ఉపయోగించే బహుమతులూ తేరగారా లేదూ ఆయన గారికి బాత్రం?"

క్షణకాలం నాకు ఏమీ పాలుపోలేదు

"సర్లె నీ బిజ్‌నెస్ మూడు పూవులూ ఆరు కాయలు అవుతుందిలే గోపాలం........మాక్కావల్సిన వస్తువు లిచ్చి మమ్మల్ని పంపించు?" అన్నారో శ్రీవారు తనని తాను సంబాళించుకుంటూ.

"అలాగే! మీ దగ్గరబాత్రం లాభం పుచ్చుకోను !" అంటూనే పాకెట్సు చేతికిచ్చాడు గోపాల్.

కారు దగ్గరకు వచ్చాం....

"అమ్మగారూ! బాబుగారూ! అతిదీనంగా వినిపించిన గొంతుకతో, వెనుదిరిగి చూశాం....

ఆ రేజు మేముచూచిన బిచ్చగాడు.... ఈరోజు రెండు కాళ్ళకూ బదులుగా కర్రవాళ్ళు పెట్టుకుని వున్నాడు....కళ్ళ చుట్టూరా నల్లని మచ్చలు! ముఖం తిప్పుకొని కార్లో కూర్చున్నాను. మనస్సెందుకో పరాకుగా వుంది.

చటుక్కున పర్సు తీసి వాడి చేతిలో ఐదురూపాయల నోటుంచారు శ్రీవారు. నాతో'బాటూ' వాడూ నిర్ఘాంత పోయాడు. కారు కదిలింది.

"రాధా! చూశావూ! ఆరోజు నువ్వో రూపాయి ఇవ్వబోతే అడ్డుపడ్డాను. కానీ ఈరోజు నా కనిపిస్తోంది........ఈ బిచ్చగాళ్ళు పాపం పొట్టకూటికోసం వేషాలువేసి, వాళ్ళ శరీరాన్ని బాధపెట్టుకుంటున్నారు.... వీళ్ళకు దానం చేస్తే తప్పేముందీ ? అనిపించింది నామటుకునాకు.... కానీ డాక్టర్ మూర్తి....విజయ, వినాయకరావు....లలితారావు....వీళ్ళంతా రాయల్ బెగ్గర్స్ రాధా! యాచకులుకాని యాచకులు.... వంచకులు....తమ విలాసాలకోసం, అందంగా యాచివవృత్తి చేపట్టినవారు కదూ?"

శ్రీవారుమాటలకు'అవును....కాదు'అని చెప్పేలోగానే కారులోని ట్రాన్సిస్టర్ 'లో' టోన్‌లో పలుకుతోంది.

"....మనదేశంలో బిచ్చగాళ్ళ సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. సోమరితనమే అందుకు కారణం. బిచ్చగాళ్ళను చూచి జాలిపడకండి.... ....దానంచేసి వారిని పోషించకండి, పెంచకండి!"

ఠక్కున రేడియో ఆఫ్ చేసేశాను.

మరి ఈ రాయల్ బెగ్గర్స్ మాటేమిటి ?

("మహాసిని" మే 68)